RNI NO : TELTEL/2023/86487
క్విక్ టుడే QUICK TODAY
శనివారం 28 ఫిబ్రవరి 2026
quicktodaynews.com


# మీడియా ముసుగులో అక్రమాలు

**సమాజంపై మచ్చగా మారుతున్న వ్యవహారాలు**

**కేసులు ఉన్నవారికి అక్రిడేషన్ కార్డులు**

**చదువు లేనివారు అధికారులను బెదిరించే స్థాయికి దిగిన మీడియా**

**కలెక్టర్ పట్టించుకోకపోతే ప్రభుత్వానికే మచ్చ**




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో.(క్విక్ టుడే న్యూస్):

ఉమ్మడి విశాఖ అనకాపల్లి జిల్లాలో మీడియా ముసుగులో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. వార్తల సేకరణ అనే పవిత్ర వృత్తిని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కవచంగా మార్చుకున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హతలు లేకపోయినా, చదువు లేకపోయినా, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారికీ అక్రిడేషన్ కార్డులు జారీ అవుతున్నాయనే ఆరోపణలు వ్యవస్థలోని లోపాలను బట్టబయలు చేస్తున్నాయి. ప్రైవేట్ మీడియా సంస్థల పేరుతో కొందరు వ్యక్తులు రిపోర్టర్లుగా పరిచయం చేసుకుని రియల్ ఎస్టేట్, భూదందాలు, అక్రమ వ్యాపారాలకు జర్నలిజాన్ని ముసుగుగా ఉపయోగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులను బెదిరించడం, తమకు అనుకూలంగా వ్యవహరించాలంటూ ఒత్తిడి చేయడం, పోలీస్ స్టేషన్లకు గుంపులుగా వెళ్లి కేసుల నమోదులో జోక్యం చేసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం వెలుగులోకి వస్తోంది.పండగలు, గృహప్రవేశాలు, దుకాణాల ప్రారంభోత్సవాలు, ఇళ్ల నిర్మాణాల సమయంలో "మీడియా" పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. యూనియన్ పేరుతో గుంపులుగా తిరుగుతూ సామాన్యులపై ఒత్తిడి తెస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నిజాయితీగా వార్తలు సేకరించే జర్నలిస్టులపైనా అనుమానాల మబ్బులు కమ్ముకుంటున్నాయని సీనియర్ మీడియా వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించకపోతే అది ప్రభుత్వానికే మచ్చగా మిగిలిపోతుందని సామాజిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. అక్రిడేషన్ కార్డుల జారీపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అర్హతలు లేని వారిని తొలగించాలని, నకిలీ జర్నలిస్టులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జర్నలిజం అనే నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, పరిపాలన, మీడియా సంస్థలపై ఉందని, లేకపోతే సమాజంలో నిజం–అబద్ధం మధ్య గీత చెదిరిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మీడియా పేరు చెప్పి భయపెట్టే రోజులు పోయి, నిజం చెప్పే రోజులు రావాలి" అనే ఆశతో ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# అధికారులు మారేదెప్పుడు?

# ప్రజలకు న్యాయం చేసేది ఎప్పుడు?

విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో(క్విక్ టుడే న్యూస్);

అనకాపల్లి జిల్లా /:ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడం, అవినీతి ఆరోపణలు, అధికార–రాజకీయ కలయికపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు అనేక విభాగాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం వల్ల సాధారణ ప్రజలు న్యాయం కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రజలు చెబుతున్న వివరాల ప్రకారం, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు సక్రమంగా జరగడం లేదని, కొంతమంది అధికారులు ప్రజా ప్రతినిధుల ఒత్తిడితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. లంచాలు లేకుండా పనులు జరగవని, భూమి సంబంధిత వివాదాలు, అనుమతులు, పథకాల అమలు వంటి అంశాల్లో పారదర్శకత లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పోలీస్ స్టేషన్లలో కూడా బాధితుల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని, రాజకీయ ఒత్తిడితో కేసుల నమోదు, విచారణ జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. తప్పు చేసిన వారిపై



చర్యలు తీసుకోవడం లేదని, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారని కొందరు బాధితులు తెలిపారు. ఆరోగ్య రంగంలో కూడా రాజకీయ జోక్యం ఉందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత, వైద్య సేవలలో నిర్లక్ష్యం కారణంగా పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు కలగన్న పారదర్శక పాలన ఎక్కడ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ వంటి మహనీయులు దేశం కోసం ప్రాణాలు అర్పించగా, ఇప్పటికీ అవినీతి, అధికార దుర్వినియోగం కొనసాగుతుండడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. అలాగే మహాత్మా గాంధీ చెప్పిన సత్యం, న్యాయం, పారదర్శకత విలువలు అమలులో కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా స్పందన రాలేదని కొందరు బాధితులు తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే పరిపాలనలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు సూచిస్తున్నాయి. "సత్యమేవ జయతే" నినాదం కేవలం పలుకుబడిగా కాక, పాలనలో అమలవ్వాలని ప్రజలు కోరుతున్నారు.